క్లుప్తంగా

నేడు ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని సిద్దారెడ్డిపల్లె, మొర్రాయిపల్లె గ్రామాలలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందిస్తామన్నారు. అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

బీజేపీతో రాయలసీమకు ఉపయోగం లేదు

ప్రొద్దుటూరు : బీజేపీ వల్ల రాయలసీమకు ఎలాంటి ఉపయోగం లేదని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి రాయలసీమ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నామని ప్రకటించారని, కానీ ఇప్పటి వరకు రాయలసీమకు బీజేపీ ఎటువంటి న్యాయం చేయలేదని ఆయన పేర్కొన్నారు. సిద్దేశ్వరం బ్రిడ్జి కం బ్యారేజి కావాలని రాయలసీమ వాసులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోలేదని తెలిపారు. రాయలసీమ ప్రాంతానికి నష్టం చేసే అప్పర్ భద్ర ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారన్నారు. గుండ్రేవుల ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా అయ్యంకి జయంతి



అయ్యంకి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జింకా సుబ్రహ్మణ్యం తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుట్టపర్తి సాహితీ పీఠం కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, విశ్రాంత తెలుగు పండితులు వి.మునిభాస్కర్ రాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్, విశ్రాంత వైమానికదళ అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటకొండయ్య, శ్రీనివాసుల రెడ్డి, స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణ ప్రారంభం



కుట్టుమిషన్ శిక్షణ ప్రారంభోత్సవంలో ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి

ప్రొద్దుటూరు : స్థానిక సూపర్ బజార్ రోడ్డులో వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండో విడత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు నాబార్డు రుణాలు అందిస్తోందన్నారు. ఈ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇలాంటి శిక్షణను మహిళలు ఉపయోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, శిక్షకురాలు దేవి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సత్కరించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

బద్వేలు అర్బన్ : జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజును సోమవారం కడపలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బద్వేలు ఆర్యవైశ్య వర్తక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. పట్టణంలోని మైదుకూరు రోడ్డులో గల ఆర్యవైశ్య శ్మశానవాటిక ఆవరణలో కన్యకాపరమేశ్వరీ షాపింగ్ మాల్ ఏర్పాటుకు సహకరించిన నేపథ్యంలో మర్యాదపూర్వకంగా కలిసి వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేసి సత్కరించారు. అలాగే ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనాను కూడా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, గౌరవాధ్యక్షులు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయి క్రిష్ణ, ఉపాధ్యక్షులు మునగాచలమయ్య, సెక్రటరీ కొలిశెట్టినాగరాజు, జాయింట్ సెక్రటరీ సగ ళాసురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

గోపవరం : ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లతోటలు సాగు చేసుకునేందుకు ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని బద్వేలు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పండ్ల తోటల పెంపకానికి ఈ నెల 31వ తేదీలోపు రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 12 రకాల పండ్ల తోటలను సాగు చేసుకోవచ్చన్నారు. 5 ఎకరాలలోపు ఉండి జాబ్‌కార్డు, బోరుబావి ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. మొక్కలు నాటినప్పటి నుండి 3 సంవత్సరాల లోపల ఉపాధి హామీ ద్వారానే నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తులను ఉపాధి, ఉద్యాన కార్యాలయాల్లో అందజేయాలన్నారు.

సీఎం వైఎస్ జగన్ చెప్పారంటే.. చేస్తారంతే..

ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బి.కోడూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట చెప్పారంటే అది చేసి చూపిస్తాడే తప్ప చంద్రబాబు మాదిరి మాటలు చెప్పి తప్పించుకునే నాయకుడు కాదని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రామసముద్రం సచివాయం పరిధిలో ఎంపీడీఓ రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో చెప్పినవే కాకుండా చెప్పనివి కూడా అనేక సంక్షేమ పథకాలను ఆయన ప్రవేశపెట్టి బడుగు, బలహీన వర్గాల వారికి తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు అమలుకు సాధ్యం కాని 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత 6 హామీలను కూడా నెరవేర్చలేదని ఆమె తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఆమె కోరారు. అనంతరం సర్వే ద్వారా 168 మందిని గుర్తించగా 164 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దావీదు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రామకోటి, సర్పంచ్ ఆదిలక్ష్మమ్మ, తహసీల్దారు విద్యాసాగర్, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని వివరిస్తూ .. సమస్యలు వింటూ

కలసపాడు : వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఎమ్మెల్యే డాక్టర్ సుధ పర్యటన సాగింది.



బి.కోడూరు : లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైఎస్సార్‌సీపీ నాయకులు

మండలంలోని పెండ్లిమర్రి, చెన్నారెడ్డిపల్లె గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారం చేపట్టిన నాటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం ప్రజల కోసం పనిచేస్తున్నారని అన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందిస్తూ వారిని ఆర్థికంగా ఆదుకుంటున్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వానికి ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించాలన్నారు. పెండ్లిమర్రిలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సమస్యలను పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకనగురివిరెడ్డి, సూదారామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణయాదవ్, చిత్తారాజశేఖర్‌రెడ్డి, యువ నాయకుడు వెంకటరామిరెడ్డి, సింగరయ్య, సర్పంచ్ కొండారమణమ్మ, ఎంపీటీసీ ఎం.వెంకటలక్షుమ్మ, శ్రీరాములురెడ్డి, శేషారెడ్డి, రామసుబ్బారెడ్డి, ఎంపీడీఓ మహబూబ్‌బీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం

కలసపాడు : జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం జరుగుతుందని మండల స్పెషలాఫీసర్ మురళీధర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చింతలపల్లె గ్రామ సచివాలయ ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్వే ద్వారా 422 మందిని గుర్తించి 412 మందికి వివిధ సర్టిఫికెట్లు ఉచితంగా అందజేశారు.

జగనన్న సురక్ష పేదలకు వరం

ప్రొద్దుటూరు : నెల రోజులపాటు జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు బాగా వినియోగించుకున్నారని మెప్మా పీడీ సురేష్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కల్లూరు గ్రామ సచివాలయంలో సర్పంచ్ శివలక్ష్మి అధ్యక్షతన సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ నెల రోజుల్లో వేలాది సర్టిఫికెట్లకు ప్రజలు దరఖాస్తు చేసుకోవడం, వెంటనే మంజూరు చేసి ఇవ్వడం జరిగిందన్నారు. రూపాయి డబ్బు లేకుండా సర్టిఫికెట్లు అందించామన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఈ కార్యక్రమం చాలా ఉపయోగపడిందన్నారు. అనంతరం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ రహంతుల్లా, ఏపీఎం వెంకటసుబ్బమ్మ, పంచాయతీ కార్యదర్శి పుల్లారెడ్డి పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న నాగార్జునరెడ్డి

జగనన్న సురక్షతో సంక్షేమ పథకాలు

పోరుమామిళ్ల : సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందాలన్న సదాశయంతో ముఖ్యమంత్రి జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి రాష్ట్ర సలహాదారు నాగార్జున రెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కొత్రపాటిపల్లె సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు మాట్లాడారు. 200కు పైగా సర్టిఫికెట్లు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ–1 సీఎం బాష, వైస్‌ఎంపీపీ–2 చెన్ను రాజశేఖర్, ఎపీటీసీ వెంకటేశ్వర్లు, సర్పంచ్ కాశీలక్ష్మి, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు పక్కాగా చేపట్టాలి

గోపవరం : ప్రస్తుత సీజన్‌లో రైతులు సాగు చేసే ప్రతి పంటను పక్కాగా నమోదు చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి పంట నమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతి రైతుతో మాట్లాడి వారు సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే రైతులు కూడా సాగు చేసిన పంటకు ఈ–పంట నమోదు చేసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. మాస్టర్ ట్రైనర్ ఈ–పంట నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఏఓ అరవిందనాయక్, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో మొహర్రం సందడి

కాశినాయన : మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం సందడి నెలకొంది. పీర్లచావిడిలలో పీర్లను సుందరంగా అలంకరించి పెట్టారు. నరసాపురం, గంగనపల్లె, గొంటువారిపల్లె, బాలాయపల్లె, వరికుంట్ల, ఆకులనారాయణపల్లె, అంబవరం గ్రామాల్లో మొహర్రం పండుగను ఘనంగా జరుపుకుంటారు. హిందువులు, ముస్లింలు ఐకమత్యంగా మొహర్రం పండుగను జరుపుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 28వ తేదీన చిన్నసరిగెత్తుతో ప్రారంభమై 31వ తేదీ పీర్లు స్నానానికి పోయే విధంగా పండుగను జరుపుకుంటున్నామని ముస్లిం పెద్దలు తెలిపారు.

వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నీ అమలు

అట్లూరు : పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సోమవారం తంబళ్లగొంది సచివాలయ ఆవరణంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో ప్రజల కష్టాలను తెలుసుకుని అప్పట్లో ఇచ్చిన హామీలన్నీ నవరత్నాల పథకాలలో భాగంగా అమలు చేస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు తన పాలనలో డ్వాక్రా రుణాలు చెల్లించవద్దని అన్నీ మాఫీ చేస్తానని చెప ఇప్పి మోసం చేశారన్నారు. అలాగే రైతుల రుణ మాఫీ కూడా మాటలకే పరిమితం చేశారన్నారు. ప్రజలు గత ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు ఏమేర అమలు చేశారు. అదే మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఏవిధంగా అమలు చేస్తున్నారో ఒక సారి ఆలోచించాలని కోరారు. అనంతరం లబ్దిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బద్వేలు మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, మండల కన్వీనరు ప్రభాకర్‌రెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టరు మల్లికార్జునరెడ్డి, అందూరు రామకృష్ణారెడ్డి, మణ్యం మల్లికార్జునరెడ్డి, సిరిపిరెడ్డి రమణమ్మ, సుబ్బారెడ్డి, మల్లు సుబ్బారెడ్డి, కొత్తపుమునిరెడ్డి, తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీఓ సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

సెంటు స్థలం ఆక్రమించి ఉంటే వడ్డీతో సహా చెల్లిస్తాం

వరదకు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి సవాల్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో స్థలం ఆక్రమించామని, బోగస్ రిజిస్ట్రేషన్ చేయించామని నిరూపిస్తే అలాంటి వారికి ప్రస్తుత మార్కెట్ ధరతోపాటు వడ్డీ కూడా చెల్లిస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి సవాల్ విసిరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వరద చెప్పుడు మాటలు విని వాటిని స్టేట్‌మెంట్లుగా ఇచ్చి తన స్థాయిని మరింత దిగజార్చుకుంటున్నారన్నారు. 250 ఎకరాల భూమిని ఆక్రమించామని, రూ.1000 కోట్లు సంపాదించామని, మా బావ ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాదరెడ్డి, ఆయన సోదరుడు రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డితోపాటు తనపై వరద విమర్శలు చేశారన్నారు. మీ కుమారుడు నంద్యాల కొండారెడ్డి చేసిన అప్పులకు ఇచ్చిన బాండ్ల విషయం మరోమారు మాట్లాడుతామన్నారు. ప్రస్తుతం రూ.1000 కోట్ల విషయం గురించే మాట్లాడుతామన్నారు. ప్రొద్దుటూరులో ఎకరం భూమి విలువ రూ.4కోట్ల వరకు ఉంటుందని, ఈ ప్రకారం రూ.1000 కోట్లకు 250 ఎకరాలను తాము ఆక్రమించినట్లు అవుతుందన్నారు. మేం భూములను ఆక్రమిస్తుంటే మీరెందుకు సైలెంట్‌గా ఉన్నారని, ఇందులో మీకేమైనా ముట్టిందా అని అనుమానం వ్యక్తమవుతోందన్నారు. 26 ఏళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డికి ఎలాంటి మచ్చ లేదన్నారు. దారిలో కాగితాలు ఏరుకునేవారు విమర్శలు చేసినా తాము స్పందించడం లేదని, కొద్దో గొప్పో విలువ ఉన్న వరదకు సమాధానం చెబుతున్నామన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరుకు రానివ్వను అన్న వారి వెంటే తిరుగుతున్నాడు..

సీఎం సురేష్ నాయుడు కుటుంబం వార్డు మెంబర్‌కు ఎక్కువ, సర్పంచ్‌కు తక్కువ అని, అలాంటి వారిని ప్రొద్దుటూరులో అడుగు పెట్టనివ్వమని ప్రగల్భాలు పలికిన వరద ప్రస్తుతం తన రాజకీయ స్వార్థం కోసం వారి వెంటనే తిరుగుతున్నారని బంగారు మునిరెడ్డి విమర్శించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి కొనుగోలు చేసిన భూములు, వేసిన ప్లాట్లకు సంబంధించి ఎవరు నష్టపోయినా తాము అసలుతోపాటు వడ్డీ చెల్లిస్తామని ఆఫర్ ఇస్తున్నామన్నారు. కేవలం స్వార్థంతో ప్రజలను తప్పుదారి పట్టించేందుకు వరద ప్రయత్నిస్తున్నారన్నారు. వరుసగా ఐదు మార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన వరద.. ఐదు మార్లు ఎన్నికల్లో ఓటమి పాలయ్యారనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో 34వ వార్డు ఇన్‌చారి భాస్కర్, కౌన్సిలర్ కమాల్ పాల్గొన్నారు.

నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా

బద్వేలు అర్బన్ : నమ్మిన విలువల్ని, సిద్ధాంతాల్ని తన రచనల ద్వారా నిక్కచ్చిగా ప్రకటించిన నవయుగ కవిచక్రవర్తి గుర్రంజాషువా అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. జాషువా వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక సుందరయ్య భవనం ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ ఉద్యమం కాలంలో భారతమాత గొప్పదనాన్ని చాటిచెప్పే అనేక విషయాలను తన కవిత్వంలో పొందుపరిచి ప్రజల్లో దేశభక్తిని నింపారని అన్నారు. నేటి యువత జాషువాను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు, డీవైఎఫ్‌ఐ మహిళా కన్వీనర్ దేవి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్, షరీఫ్, నాయకులు నాగార్జున, ఇమ్మానియేల్, మహిళా సంఘం నాయకురాలు అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీఐటీయూ, డీవైఎఫ్‌ఐ నాయకులు

అర్జీలకు పరిష్కారం చూపాలి

గోపవరం : స్పందన ద్వారా వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో, బేతాయపల్లె సచివాలయంలో అన్నిశాఖల అధికారులతో కలిసి ఆయన స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలకు వివిధ అవసరాలపై వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిశీలించి సచివాలయ పరిధిలో పరిష్కారం కానివి మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలన్నారు. అనంతరం విద్యుత్, రెవెన్యూ తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినారాయణ, ఈఓపీఆర్‌డీ హసీనా, గ్రామ పంచాయతీ డీడీఓ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.



బేతాయపల్లె సచివాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

వైఎస్సార్‌సీపీలో 50 కుటుంబాల చేరిక

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామానికి చెందిన 50 కుటుంబాలు సోమవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామంలోని ఐసీఎల్ గేటు వద్ద సమీపంలో నివాసం ఉండే నల్లమేకల శేఖర్‌రెడ్డి, నల్లమేకల కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ముత్తరాసు శివ, ఎ.రాజశేఖర్, వి.పవన్‌కుమార్‌లతో పాటు మరో కొన్ని కుటుంబాలు చేరాయి. వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



పార్టీలో చేరిన కుటుంబాలతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

డీఈఓ వ్యవహారాలపై విచారణ జరపాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి ఉపాధ్యాయులపై వ్యవహరిస్తున్న తీరు, పాల్పడుతున్న అక్రమాలపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సోమవారం కలెక్టర్ విజయరామరాజును కోరారు. ఆదర్శంగా ఉండాల్సిన డీఈఓ టీచర్ల పట్ల అనుచితంగా, అవమానకర రీతిలో ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. డీఈఓ వ్యవహారశైలిపై విచారణ చేయిస్తామంటూ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్సీ తెలిపారు.

ఎమ్మెల్సీ క్షమాపణ చెప్పాలి

కడప ఎడ్యుకేషన్ : పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తనపై నిరాధారమైన, అర్థరహిత ఆరోపణలు చేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానని డీఈఓ రాఘవరెడ్డి అన్నారు. ఆయన వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు.

రజకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

కడప రూరల్ : రజకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని రజక సంఘాల సమైఖ్య జిల్లా అధ్యక్షులు యంమల్లయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఆ సంఘం జిల్లా కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో రజకులు వెనుకబడి ఉన్నారని తెలిపారు. రాజకీయ ప్రాధాన్యత కల్పించినప్పుడే తమ వర్గీయుల ప్రగతి సాధ్యపడుతుందని అన్నారు. కార్యక్రమంలో కొండయ్య, శివ, సుబ్బరాయుడు, గంగయ్య, రమణ, కేఎస్ రెడ్డెయ్య పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయ ఆధ్వర్యంలో జరుగుతున్న జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 26న పెండ్లిమర్రి, వేంపల్లెలో ఉదయం 10.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఆయా ఎంపీడీఓ కార్యాలయాల్లో, 27న కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉదయం, మధ్యాహ్నం సీకే దిన్నె ఎంపీడీఓ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. కడప నగర శివార్లలోని కొప్పర్తిలో ఉన్న అల్ డిక్సన్ కంపెనీలో ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువతకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు ఆయా ఎంపీడీఓ కార్యాలయాల్లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. వివరాలకు 63059 92081, 95243 52809 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పని చేసి 2014కు ముందు రిటైర్డ్ అయిన ఉద్యోగులకు చాలీ చాలని పెన్షన్ అందుతోందని, తమకు కూడా ప్రస్తుతం ఇస్తున్నట్లుగా పెన్షన్ సౌకర్యం కల్పించాలని వైఎస్సార్ ఆర్టీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సెక్రటరీ ఎల్.రఘునాథ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్‌లు ఒక ప్రకటనలో కోరారు. 1.9.2014కు ముందు రిటైర్డ్ అయిన కార్మికులకు పెన్షన్ రూ. 800–2500 మధ్య వస్తోందన్నారు. ఈ మేరకు ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్‌కు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళుతున్నామన్నారు. ఈనెల 26వ తేది ఉదయం 10 గంటలకు కడప రీజినల్ మేనేజర్ కార్యాలయానికి చేరుకుని వారికి వినతిపత్రాన్ని సమర్పించి ఆ తర్వాత ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డికి విన్నవించనున్నామన్నారు. అందుకు రిటైర్డ్ కార్మికులందరూ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

క్రీడాకారులకు అభినందన

కడప స్పోర్ట్స్ : బెంగుళూరులో ఇటీవల నిర్వహించిన 5వ నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో కడప నగరానికి చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. వీరిని సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి టి.కె. అఫ్జల్‌ఖాన్ తన కార్యాలయంలో మెడల్స్ అందజేసి అభినందించారు. నగరంలోని మున్సిపల్ హైస్కూల్ ఉర్దూలో శిక్షకుడు జంషీర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన అలకనంద, గితేష్, హాజీబ్, జమీల్‌అహ్మద్‌లు గోల్డ్ మెడల్స్ సాధించగా, షేక్ సాదిల్, నేహల్‌ఖాన్‌లు రజతపతకాలు సాధించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బండి బాబు, కోచ్ ఇర్ఫాన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పిల్లలకు సరైన సౌకర్యాలను అందించాలి

కడప అర్బన్ : పిల్లలకు సరైన సౌకర్యాలను అందించాలని, వారి ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా వుండాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జడ్జి తమ సిబ్బందితో కలిసి కడపలోని ప్రభుత్వ బాలుర గృహంను సందర్శించారు. అక్కడ పరిసరాలను, పిల్లలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. తరువాత న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవలు పథకం 2015ను వివరించారు. పిల్లల పట్ల ఎప్పటికపుడు తగిన జాగ్రత్త తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరింటెండెంట్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్‌కుమార్

సచివాలయ కార్యదర్శులపై దాడులను అరికట్టాలి


కడప కార్పొరేషన్ : గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులపై జరిగే దాడులను అరికట్టాలని ఏపీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు బి. శ్రీనివాసులు కోరారు. సోమవారం 13వ డివిజన్ ప్లానింగ్ సెక్రటరీ రామమోహన్‌పై దాడి చేయడాన్ని నిరసిస్తూ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారని, ప్రజలకు అన్ని రకాల సేవలను సచివాలయ వ్యవస్థ ద్వారా అందిస్తున్నారన్నారు. ప్రజా సేవలో విధులు నిర్వహించే క్రమంలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను పై అధికారుల ఆదేశాలతో ఆపారనే కారణంతో దాడి చేయడం సరికాదన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీవో సంఘం జిల్లా కార్యదర్శి డి. రవికుమార్, నగర అధ్యక్షుడు కె. చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వర్‌రెడ్డి, నాగార్జునరావు, పద్మనాభరావు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు హీరామియా, కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఏపీఎన్‌జీవో, సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు

యూపీఎస్‌సీ విజేతకు అభినందన

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం జర్నలిజం శాఖ పూర్వ విద్యార్థి బి. ధర్మానాయక్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య అభినందించారు. ధర్మానాయక్ యూపీఎస్‌సీ నిర్వహించిన ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్, మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ శాఖలో సీనియర్ గ్రేడ్ గెజిటెడ్ ఆఫీసర్ పోస్టుకు ఎంపికైన సందర్భంగా సోమవారం ఈయన్ను అభినందించారు. కార్యక్రమంలో జర్నలిజం శాఖాధిపతి డా. టి.శ్యామ్‌స్వరూప్, అధ్యాపకులు డా. టి.సురేష్‌బాబు పాల్గొన్నారు.



ధర్మానాయక్‌ను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : కాంట్రాక్టు ఉద్యోగుల తరహాలోనే ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా జరిగింది. సీఐటీయూ నాయకులు మనోహర్ మాట్లాడుతూ ఆప్కాస్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలన్నారు. సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. ఆప్కాస్‌ఉద్యోగుల కోర్కెల సాధనకు ఆగస్టు 14న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వెంకట సుబ్బయ్య, ఎం.రవిప్రకాశ్, సుదర్శన్, బాలాజీరావు పాల్గొన్నారు.

నేడు అభ్యుదయ సాహిత్య ఉపన్యాసం

కడప కల్చరల్ : స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మంగళవారం అభ్యుదయ సాహిత్య ఉపన్యాసం నిర్వహించనున్నామని యోగి వేమన విశ్వవిద్యాలయం కుల సచివులు ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఉదయం 10.00 గంటలకు బ్రౌన్ శాస్త్రి సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ బాల సాహిత్య రచయిత డీకే చదువులబాబు విశిష్ట అతిథిగా, కథా రచయిత పాలగిరి విశ్వప్రసాద్ గౌరవ అతిథిగా హాజరు కానున్నట్లు వివరించారు.